
సాక్షి చిత్తూరు

శుక్రవారం । 15 । డిసెంబర్ । 2023



ప్రభుత్వ భూమికి విముక్తి
పరాధీనంలో ఉన్న రూ.కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమికి విముక్తి లభించింది. ఈ మేరకు హైకోర్టులో తీర్పు వచ్చింది - IIలో



సౌకర్యశోభితం
ప్రభుత్వ పాఠశాలలు 'సౌకర్య' శోభితంగా మారాయి. ఆర్థిక స్తోమతలేని తల్లిదండ్రులకు ఖర్చు లేని కల్పవృక్షాలుగా విరాజిల్లుతున్నాయి. - IIలో



పొదుపుమంత్రం..కాంతివంతం
ఏ రంగంలోనైనా పొదుపు అవసరమే. ఇంధనం ఆదా చేయడమంటే సమర్థవంతంగా వినియోగించుకోవడమే. - IIలో

న్యూస్‌రీల్

27 నుంచి డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు

తిరుపతి సిటీ: ఎస్వీ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 27 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు పరీక్షల నియంత్రణ అధికారి ధామ్లానాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ ఒకటి, మూడు, ఐదు సెమిస్టర్ (రెగ్యులర్, సప్లిమెంటరీ)కు సంబంధించి పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. షెడ్యూల్ ప్రకారం మొదటి సెమస్టర్ పరీక్ష ఉదయం, మూడవ సెమిస్టర్ పరీక్ష మధ్యాహ్నం అలాగే తర్వాత రోజు ఐదో సెమిస్టర్ పరీక్షలను ఆయా తేదీల్లో నిర్వహించేందుకు టైంటేబుల్ సిద్ధం చేశామన్నారు. ఒక్కో సెమిస్టర్‌కు సుమారు 22 వేల మంది విద్యార్థులు హాజరుకానున్నట్టు పేర్కొన్నారు. ఉమ్మడి చిత్తూర్ జిల్లా వ్యాప్తంగా సుమారుగా 75 సెంటర్లు పరీక్షలకు సిద్ధం చేస్తున్నట్టు ఆయన వెల్లడించారు.

వైఎస్సార్‌సీపీలో నియామకాలు

చిత్తూరు కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర పార్టీ అనుబంధ విభాగ కమిటీల్లో చిత్తూరు, తిరుపతి జిల్లాలకు చెందిన పలువురికి పదవులు కల్పిస్తూ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. చిత్తూరు జిల్లా పరిధిలో రాష్ట్ర మైనార్టీ సెల్ కమిటీ అధ్యక్షుడిగా వి.ఖాదర్ బాషా, జోనల్ ఇన్‌చార్జి (జోన్–8) ఎస్ఎఫ్ షరీఫ్, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధికార ప్రతినిధిగా కే.జోషువా, కార్యదర్శిగా ఎ.ప్రిన్సిప్రియ, రాష్ట్ర వాణిజ్య విభాగం జోనల్ ఇన్‌చార్జి (జోన్–8) డీఎస్ వెంకటేష్‌బాబు, సంయుక్త కార్యదర్శులుగా డి.భక్తవత్సలం, కే.బాలసుబ్రమణ్యం, జి.మంజునాథ్, కే.నవీన్‌కుమార్, రాష్ట్ర వీవర్స్ వింగ్ సంయుక్త కార్యదర్శిగా ధనశేఖర్‌లను నియమించారు.

తిరుపతి జిల్లా పరిధిలో.. రాష్ట్ర బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జిగా (జోన్–6) టి.పుల్లయ్య, కార్యదర్శిగా చిరంజీవి, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడిగా కే.మార్టిన్, కార్యదర్శులుగా ఎస్.నెల్సన్, సెల్వం, సంయుక్త కార్యదర్శిగా ఎం.రవికుమార్, రాష్ట్ర మైనార్టీ జోనల్ ఇన్‌చార్జి (జోన్–6) షఫీమహమ్మద్ ఖాద్రి, ప్రధాన కార్యదర్శిగా ఎస్.మస్తాన్, కార్యదర్శులుగా డి.ఎం.రఫీ, షేక్ అబ్దుల్ లతీఫ్, సంయుక్త కార్యదర్శిగా షేక్ అబ్దుల్, రాష్ట్ర రైతు విభాగం ప్రధాన కార్యదర్శిగా సి.మధుసూదన్‌రెడ్డి, కార్యదర్శిగా మురగయ్య, రాష్ట్ర వాణిజ్య విభాగ ఉపాధ్యక్షుడిగా పి.సత్యనారాయణశెట్టి, ప్రధాన కార్యదర్శిగా బీఎస్ గుప్త, కార్యదర్శిగా జే .శరత్‌కుమార్, రాష్ట్ర వీవర్స్ జోనల్ ఇన్‌చార్జి (జోన్–6) ఎం.హరి, ప్రధాన కార్యదర్శిగా ఎం.జానకిరామ్, కార్యదర్శిగా ఎస్.సుబ్రమణ్యం, సంయుక్త కార్యదర్శిగా ఆర్.ఎ.హేమంత్‌రావ్‌ను నియమించారు. ఈ మేరకు వారు ఆయా బాధ్యతలు స్వీకరించనున్నారు.

సమ్మె విరమణ దిశగా....

చిత్తూరు కలెక్టరేట్ : విధులకు హాజరుకాకుండా సమ్మెలో ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు సమ్మెను విరమించేందుకు పలువురు సుముఖత చూపుతున్నారు. జిల్లా వ్యాప్తంగా శుక్రవారం నుంచి పూతలపట్టు, పెనుమూరులో విధులకు హాజరవుతామని ఆయా కార్యకర్తలు గురువారం అధికారులకు వెల్లడించారు. బుధ, గురువారాల్లో జిల్లాలోని పలు ప్రాజెక్టుల్లో పనిచేస్తున్న కార్యకర్తలు సమ్మెలోకి వెళ్లడంతో అంగన్‌వాడీల్లోని చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. సమీపంలోని పాఠశాలల నుంచి అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు మధ్యాహ్న భోజనం పెట్టించారు. పులిచెర్ల ప్రాజెక్టు పరిధిలోని 3 మండలాల్లో పనిచేస్తున్న కార్యకర్తలు, ఆయాలు సమ్మెలోకి వెళ్లలేదని అధికారులు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 12 ప్రాజెక్టుల పరిధిలోని 2,420 అంగన్‌వాడీ కేంద్రాలు పనిచేసేలా జిల్లా ఐసీడీఎస్ పీడీ నాగశైలజ గురువారం అంగన్‌వాడీ కార్యకర్తలతో చర్చలు జరిపారు.

కళ్లారా చూసి..

కనికరించండి సామీ!

కేంద్ర కరువు బృంద సభ్యులతో తమ బాధలు చెప్పుకుంటున్న మహిళా రైతు



'మా కష్టాలను నేరుగా చూసేందుకు వచ్చారు. మా బాధలను గమనించండి. మాకు మేలు చేయండి.. సామీ' అని కేంద్ర కరువు బృందం సభ్యులను బాధిత రైతులు వేడుకున్నారు. జిల్లాలో మొత్తం నాలుగు మండలాలను కరువు మండలాలుగా ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో పలమనేరు, రామకుప్పంలో ఎక్కువ కరువు ఉందని, గంగవరం, రొంపిచర్లలో కరువు మాధ్యమికంగా ఉందని అధికారులు నివేదిక ఇచ్చిన విషయం తెలిసిందే. పలమనేరు మండలంలో నెలకొన్న కరువు పరిస్థితిని ప్రత్యక్ష్యంగా చూసేందుకు ఐఎమ్ఆర్టీ(ఇంటర్ మినిస్ట్రీరియల్ సెంట్రల్ టీం) జేసీ శ్రీనివాసులు, జిల్లాలోని వివిధ శాఖల అధికారులతో కలసి గురువారం మండలంలోని గుండ్లపల్లె, శ్రీరంగరాజపురం గ్రామాల్లో పర్యటించి, రైతులతో మాట్లాడి, దెబ్బతిన్న వేరుశనగ పంటలను పరిశీలించారు.

– పలమనేరు

- దెబ్బతిన్న వేరుశనగ పంటపై కేంద్ర కరువు బృందం ఆరా
- సేద్యం కష్టాలను వివరించిన రైతులు
- తప్పకుండా తోడ్పాటునందిస్తామని కరువు బృందం హామీ



కేంద్ర కరువు బృంద సభ్యులకు పడమటి మండలాల్లో సేద్యం సమస్యలు వివరిస్తున్న రైతు

మా కష్టాలివి దేవరా..

గుండ్లపల్లెకు చెందిన గౌరమ్మ తన రెండున్నర ఎకరాల్లో వేరుశనగ పండించి వర్షాలు లేక 30 కిలోల వేరుశనగ మాత్రమే దక్కిందని కరువుబృందానికి విన్నవించింది. దీంతో తనకు రూ.50 వేలు నష్టం వాటిల్లిందని చెప్పింది. ఇదే గ్రామానికి చెందిన రూపావతి తాను వేరుశనగ పంటకు పెట్టిన పెట్టుబడిలో పదిశాతం రాలేదని వాపోయింది. తన ఎకరా చెరుకు పంటపై బ్యాంకులో రూ.70 వేలు రుణం పొంది, పక్కనే ఉన్న ఆరు ఎకరాలు కౌలుకు తీసుకుని అందులో రూ.70 వేలు పెట్టుబడిగా పెట్టానని ఎంపీ కోటూరుకు చెందిన కన్నయ్య తెలిపారు. దీంతో పంట చేతికి రాక మొత్తం అప్పులు పాలయ్యానని, ఉన్న చెరుకు తోటను ఏనుగులు తినేశాయని, దీంతో అప్పులు కట్టలేక ఈ గ్రామంలో తలదాచుకుంటున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధిహామీ పనులను వ్యవసాయానికి అనుసంధానం చేయాలని కల్లాడు గ్రామానికి చెందిన నరసింహారెడ్డి విన్నవించారు. ఇప్పటికే బోర్లలో నీరు తగ్గుతున్నాయని ప్రభుత్వం కరువుపై చర్యలు తీసుకోవాలని మొరం సర్పంచ్ విశ్వనాథరెడ్డి తెలిపారు. పలు ప్రైవేట్ కంపెనీలు నకిలీ ఎరువులకు రైతులకు అంటగడుతున్నాయని దీనిపై వ్యవసాయశాఖ చర్యలు తీసుకోవాలని రైతు గజేంద్ర విన్నవించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలకు బ్యాంకు గ్యారెంటీ కోసం డీకేటీ భూములను బ్యాంకులు అనుమతించడం లేదని సాకేవూరుకు చెందిన రైతు శ్రీనివాసులు తెలిపారు.

కరువుపై రైతులకు తోడ్పాటునందిస్తాం

ఇక్కడి కరువు పరిస్థితి అర్థమైందని, ఇక్కడి రైతులకు మేలు కలిగేలా ప్రభుత్వానికి నివేదిక పంపి తోడ్పాటునందిస్తామని ఐఎమ్‌సీటీ సభ్యులు, కృష్ణ, గోదావరి బేసిన్ ఆర్గనైజేషన్ సెంట్రల్ వాటర్ కమిషన్ డైరెక్టర్ దేవేంద్రరావు పేర్కొన్నారు. రాష్ట్రంలోని ఏడు జిల్లాల్లో కరువు పరిస్థితులను గమనించేందుకు మూడు బృందాల సభ్యులు వచ్చామన్నారు. చిత్తూరు జిల్లాలో నీటి వసతులు చాలా తక్కువగా ఉన్నప్పటికీ ఇక్కడి రైతులు బోర్ల ద్వారా డ్రిప్ పద్ధతుల్లో పంటలను పండిస్తుండం గొప్ప విషయం అన్నారు. అయితే ఇక్కడి మెట్ట పొలాల్లో వర్షాధారిత పంట అయిన వేరుశనగ ఈ ఖరీఫ్‌లో చాలావరకు దెబ్బతిందని గమనించామన్నారు. వచ్చే ఆరునెలల్లో ఉపాధి పనిదినాలను పెంచడం, వ్యవసాయానికి ఉపాధి పనులను అనుసంధానం చేయడం, పశువులకు మేత పంపిణీ తదితరాలపై ప్రభుత్వానికి సిఫారసు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పలమనేరు ఆర్డీఓ మనోజ్‌కుమార్ రెడ్డి, కేంద్ర కరువు బృంద సభ్యులు అంజూ బసెరా, డాక్టర్ ప్రదీప్‌కుమార్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీప్రసన్న, తహసీల్దార్ కుప్పుస్వామి, డీటీ సూర్యప్రకాష్ నాయక్, అగ్రికల్చర్ ఏడీ అన్నపూర్ణదేవి, ఏఓ సంధ్య తదితరులు పాల్గొన్నారు.



పలమనేరు మండలంలో కరువు పరిస్థితిని చూపే చిత్రాలను పరిశీలిస్తున్న కరువు బృందం సభ్యులు

జిల్లాలో వ్యవసాయ పరిస్థితులివీ సార్..

జిల్లాలోని ఆయా శాఖల అధికారులు ఇక్కడి వ్యవసాయ పరిస్థితులను కరువు బృందానికి విపులంగా వివరించారు. జేసీ శ్రీనివాసులు మాట్లాడుతూ ఇక్కడి మెట్టభూముల్లో వర్షాధారంగా వేరుశనగను రైతులు సాగు చేస్తుంటారని, ఈ దఫా సకాలంలో వర్షాలు కురవక వేరుశనగ బాగా దెబ్బతిందని తెలిపారు. జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ మాట్లాడుతూ జిల్లాలో ఏటా ఖరీఫ్‌లో 91 వేల హెక్టార్లలో వేరుశనగ సాగు అవుతుండగా ఈ దఫా పరిస్థితులు అనుకూలంగా లేక 16 వేల హెక్టార్లలో మాత్రమే పంట సాగైందన్నారు. ఇందులో 20 శాతం కూడా పంట దిగుబడులు రాలేదని పంటకోత ప్రయోగాల్లో నిర్ధారించామన్నారు. హార్టికల్చర్ జేడీ మధుసూన్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో 60 శాతం భూములు వర్షాధారంతోనే సాగవుతుంటాయన్నారు. కరువు పరిస్థితుల దృష్ట్యా 50 శాతం సబ్సిడీతో బిందుసేద్యం, మల్చింగ్ సౌకర్యాలను కల్పిస్తున్నామని తెలిపారు. వెటర్నరీ జేడీ ప్రభాకర్ మాట్లాడుతూ జిల్లాలో 5.40 లక్షల పాడి పశువులున్నాయని, వీటికోసం 500 మెట్రిక్ టన్నుల మేత అవసరం అవుతుందన్నారు. తాము ఇప్పటికే 75 శాతం రాయితీతో 529 టన్నుల మొక్కజొన్న, 660 టన్నుల సమీకృత దాణా, 1800 మందికి చాఫ్‌కట్టర్లను పంపిణీ చేశామన్నారు. సిరికల్చర్ జేడీ శోభారాణి మాట్లాడుతూ పట్టుసాగులో పలమనేరు రాష్ట్రంలోనే రెండో స్థానంలో ఉందన్నారు. ఇక్కడి రైతులకు పట్టుసాగు ఆదాయంగా మారిందన్నారు. భూగర్భజలవనరుల శాఖ అధికారి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ పలమనేరులో భూగర్భజలాలు నీటిమట్టం వెయ్యి అడుగుల లోతులో ఉంటే, కుప్పంలో రెండు వేల అడుగులకు చేరిందన్నారు. దీంతో ఈ ప్రాంతంలో కరువు ఎక్కువగా ఉన్నట్టేనన్నారు.

వరసిద్ధుని సేవలో కేంద్ర కరువు బృందం



కాణిపాకంలో కేంద్ర కరువు బృందం సభ్యులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామివారిని కేంద్ర కరువు మండలాల పరిశీలన బృందం ఐఎమ్‌సీటీ(ఇంటర్ మినిస్టీరియల్ సెంట్రల్ టీం) దేవేంద్రరావు, ప్రదీప్‌కుమార్, అంజుబసేరా, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులతో కలిసి గురువారం రాత్రి దర్శించుకున్నారు. స్వామివారి దర్శనార్థం ఆ బృందం సభ్యులు కాణిపాకం విచ్చేయగా ఆలయ ఈఓ వెంకటేశు వారికి స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేదపండితులు ఆశీర్వచనం అందించి స్వామివారి తీర్థప్రసాదాలు, చిత్రపటాలు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుశీలమ్మ, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం



డీడీ రాజ్యలక్ష్మి

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకానికి జిల్లాలో అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రాజ్యలక్ష్మి తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ సామాజికంగా, విద్యాపరంగా, ఆర్థికంగా బలహీనమైన, వెనుకబడిన వర్గాల అభ్యర్థుల కోసం రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకం పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. యూపీఎస్సీ నిర్వహించే ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షల్లో అర్హత సాధించే అభ్యర్థులకు ప్రోత్సహకంగా ప్రభుత్వం ఆర్థిక సహాయం అందజేస్తుందన్నారు. ప్రిలిమినరీ పరీక్షల్లో అర్హత సాధించిన వారికి రూ.50 వేలు ఆర్థిక సహాయం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇందుకు 2023లో నిర్వహించిన మెయిన్స్ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని చెప్పారు. ఈ నెల 19వ తేదీ లోపు అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు jnanabhumi. ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

సొంతింటికల సాకారానికే

జగనన్న స్మార్ట్‌టౌన్‌షిప్

- మౌళిక వసతులతో ఇళ్ల స్థలాలు
- మార్కెట్ విలువ కన్నా తక్కువకే అందజేత
- భూమి పూజ కార్యక్రమంలో మంత్రి ఆర్కేరోజా





లేఅవుట్ ప్లాన్‌ను డీఈకి అందజేస్తున్న మంత్రి ఆర్కేరోజా, (ఇన్‌సెట్) జేసీబీతో పనులు ప్రారంభిస్తున్న మంత్రి రోజా

నగరి : మధ్యతరగతి కుటుంబాలకు, ఉద్యోగులకు కూడా సొంతింటి కల సాకారం చేయడానికి మార్కెట్ విలువ కంటే తక్కువకే ప్లాట్లు అందించేందుకు తమ ప్రభుత్వం జగనన్న స్మార్ట్ టౌన్ షిప్‌లు ఏర్పాటు చేస్తుందని మంత్రి ఆర్కేరోజా అన్నారు. గురువారం కీళపట్టు శివారులో చిత్తూరు–తచ్చూరు జాతీయ రహదారిని ఆనుకుని ఏర్పాటు చేయనున్న జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్‌నకు ఆమె భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి పేదవాడికి సొంతిల్లు ఉండాలన్న సంకల్పంతో ఏకంగా ఇప్పటికే 31 లక్షల ఇళ్లపట్టాలు పంపిణీ చేశామని చెప్పారు. ప్రస్తుతం మధ్యతరగతి కుటుంబాలు, ఉద్యోగులకు సొంతింటి కలను సాకారం చేయడానికి జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. తుడా వారే ప్లాటను అభివృద్ధి చేసి న్యాయపరంగా ఎలాంటి చిక్కులు లేకుండా సులభమైన రీతిలో బ్యాంకు రుణాలు పొంది ఇళ్లు నిర్మించుకునేలా ప్లాట్లు అందిస్తామని తెలిపారు. రూ.18 లక్షల వరకూ వార్షిక ఆదాయం ఉన్న వారు జగనన్న టౌన్‌షిప్‌లో ప్లాట్ల కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఏడాదిలో నాలుగు వాయిదాల్లో చెల్లింపులు చేయవచ్చన్నారు. ప్లాట్ల నిర్ణీత విలువలో మొదట 10 శాతం చెల్లించి, అగ్రిమెంటు చేసుకోవాలని తరువాత నెలరోజుల్లో 30 శాతం, ఆరునెలల్లో 30 శాతం, ఏడాదిలోపు మిగిలిన 30 శాతం చెల్లిచాలన్నారు.

చెల్లింపులు పూర్తి కాగానే అభివృద్ధి చేసిన ప్లాట్లను రిజిస్టర్ చేసి చేతికి అందిస్తారన్నారు. పీఆర్సీ సందర్భంగా ఉద్యోగులకు మాట ఇచ్చిన మేరకు 10 శాతం ప్లాట్లను ఉద్యోగులకు రిజర్వు చేస్తూ 20 శాతం రాయితీతో అందిస్తామన్నారు. ఆక్షన్‌లో పాల్గొనే పెన్షనర్లకు 5 శాతం రిజర్వు చేస్తామన్నారు. దరఖాస్తులు తుడా వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా చేసుకోవాలన్నారు. పూర్తి పారదర్శకతతో కులం, మతం, ప్రాంతం, పార్టీలతో సంబంధం లేకుండా ప్లాట్లు కేటాయిస్తామని చెప్పారు. లేఅవుట్ స్థలంలో 50 శాతం స్థలం ఉమ్మడి అవసరాలైన పార్కులు, ప్లేగ్రౌండ్లు, స్కూళ్లు తదితర అవసరాలకు కేటాయిస్తామని చెప్పారు. 40 నుంచి 60 అడుగుల వెడల్పు ఉన్న రోడ్లతో మౌలిక వసతులతో ప్లాటు అందిస్తామని తెలిపారు. ఒకే విడతలో పూర్తి మొత్తం చెల్లించే వారికి 10 శాతం తగ్గింపు కూడా ఉంటుందన్నారు. పూజల అనంతరం లేఅవుట్ ప్లానును డీఈకి అందజేశారు. ఈ కార్యక్రమంలో తుడా డీఈ రవీంద్ర, ఏఈ విజయశేఖర్, వర్క్ఇన్‌స్పెక్టర్లు రాజేష్, నీలకంఠం, కౌన్సిలర్ అణ్ణెమ్మ, యాకోబు పాల్గొన్నారు.

జెండాపై ప్రతాపం



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసమూర్తి

- ధ్వంసం చేసిన గుర్తుతెలియని వ్యక్తులు
- పరిశీలించిన డీఎస్పీ శ్రీనివాసమూర్తి
- దర్యాప్తు చేపడుతున్న ఎస్ఐ

పూతలపట్టు: రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి పరంగా ముందుకెళుతుంటే కొందరు వాటిని జీర్ణించుకోలేక బుద్ధిహీనులుగా నడుచుకుంటారు. పూతలపట్టు మండలంలో జరిగిన మా నమ్మకం నువ్వే జగన్ జెండాను ధ్వంసం ఘటనే ఇందుకు నిదర్శనం. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమంతో ప్రజల్లో విశేష స్పందన లభించింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇంత వరకు ఒక్కొక్క పంచాయతీలో ప్రజలకు ఎంత మొత్తాన్ని లబ్ధి చేకూర్చిందనే విషయాన్ని ప్రజలకు తెలియజేయాలనే మంచి ఆలోచనలతో ఈ కార్యక్రమం ప్రవేశపెట్టింది. బుధవారం పూతలపట్టు మండలంలోని పోటుకనుమ పంచాయతీ పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నాయకులు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా మా నమ్మకం నువ్వే జగన్ పేరుతో జెండాను ఆవిష్కరించారు. దీన్ని గమనించిన కొందరు గుర్తు తెలియని వ్యక్తులు రాత్రికి రాత్రే జెండాతో పాటు దిమ్మెను కూడా ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఉదయం సంఘటన స్థలానికి చేరుకున్నారు. వారితో పాటు డీఎస్పీ శ్రీనివాసమూర్తి ఘటన స్థలాన్ని పరిశీలించారు. తప్పు చేసిన నిందితులను గుర్తుపట్టి వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం సర్పంచ్ బాబునాయుడుతో పాటు గ్రామస్తులు పూతలపట్టు పోలీస్‌స్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తులపై ఫిర్యాదు చేయగా, ఎస్ఐ రాంభూపాల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఇది పచ్చనేతల కుట్రేనని అనుమానిస్తున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల కన్నా ఎక్కువగానే నెరవేర్చారని, వాటిని పచ్చనేతలు జీర్ణించుకోలేక నీచమైన రాజకీయాలు చేయడం వారికే చెల్లిందని ప్రజల అభిప్రాయపడుతున్నారు.

వినియోగదారులకు ఎనర్జీ అసిస్టెంట్లు

రాష్ట్ర ప్రభుత్వ వినూత్న ఆలోచన విద్యుత్ వినియోగదారుల కష్టాలు తీర్చింది. విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం గ్రామీణ ప్రజలకు గతంలో సబ్‌స్టేషన్లు, మీసేవా కేంద్రాల చుట్టు ప్రదక్షిణలు.. పడిగాపులు కాయాల్సి వచ్చేది. ఈ ఇబ్బందులకు చెక్ పెడుతూ పల్లె ముంగిటకే ఎనర్జీ అసిస్టెంట్ల సేవలు అందుబాటులోకి తెచ్చారు. వారు నిత్యం స్థానికులకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్నారు. సచివాలయ ఎనర్జీ అసిస్టెంట్ సేవలపై ప్రత్యేక కథనం.

- సచివాలయాల నుంచి పలు విద్యుత్ సేవలు
- ట్రాన్స్‌కో, వినియోగదారులకు వారధిగా జేఎల్ఎంలు

చిత్తూరు కార్పొరేషన్: రాష్ట్ర ప్రభుత్వం సచివాలయాల్లో విద్యుత్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇప్పటివరకు విద్యుత్ బిల్లుల చెల్లింపుతోపాటు పలు విద్యుత్ సేవలను పొందేందుకు వినియోగదారులు విద్యుత్ సబ్‌స్టేషన్లు, సెక్షన్ ఆఫీసులు, మీసేవ కేంద్రాలకు వెళ్లేవారు. ఈ కష్టాలను తొలగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం వార్డు, గ్రామ సచివాలయాల్లో 14 రకాల విద్యుత్ సేవలు పొందేలా చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో జిల్లాలోని 612 గ్రామ, వార్డు సచివాలయాల్లో విద్యుత్ సేవలు అందుబాటులోకి తెచ్చింది.

ఇబ్బందులకు స్వస్తి

గతంలో పలు రకాల విద్యుత్ సేవలను పొందేందుకు వినియోగదారులు అష్టకష్టాలు పడేవారు. సబ్‌స్టేషన్, విద్యుత్ అసిస్టెంట్ ఇంజినీర్ ఆఫీసులు, మీసేవ కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చేది. సమస్యల పరిష్కారం కోసం రోజుల తరబడి తిరగాల్సి వచ్చేది. ఆ సమస్యలకు చెక్ పెడుతూ ప్రభుత్వం విద్యుత్ సేవలను సైతం సచివాలయాల్లోనే అందుబాటులోకి తెచ్చింది. పట్టణ ప్రాంతాల్లో 13 రకాల సేవలతో పాటు గ్రామాల్లో అదనంగా విద్యుత్ బిల్లుల చెల్లింపును కూడ సచివాలయాలకు అనుసంధానం చేసింది. వినియోగదారులు, విద్యుత్ సంస్థకు మధ్య వారధిగా ఎనర్జీ అసిస్టెంట్లు కీలక పాత్ర పోషిస్తున్నారు. పట్టణ, గ్రామాల్లో విద్యుత్ అంతరాయం లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో 267 మంది ఎనర్జీ అసిస్టెంట్లు వినియోగదారులకు సేవలందిస్తున్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో ఎనర్జీ అసిస్టెంట్లకు కొన్ని విద్యుత్ సర్వీసులకు సంబంధించి బాధ్యతలు అప్పగించారు. వీరు వినియోగదారులకు నిత్యం అందుబాటులో ఉంటూ తమ పరిధిలోని విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల పర్యవేక్షణ బాధ్యత నిర్వర్తిసున్నారు. లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించడం, విద్యుత్ జంపర్లు తెగిన సమయంలో వాటిని పునరుద్ధరించడం, ట్రాన్స్‌ఫార్మర్లలో తలెత్తిన సమస్యలు పరిష్కరించడం, ఆగిపోయిన, కాలిపోయిన మీటర్ల స్థానంలో కొత్త మీటర్లు ఏర్పాటు చేయడం తదితర సేవలందిస్తున్నారు. విద్యుత్ సమస్యలపై వినియోగదారులు, వలంటీర్లు, సచివాలయాల్లో ఫిర్యాదు చేస్తే అతి తక్కువ వ్యవధిలో సమస్యను గుర్తించి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నారు.

సేవలను వినియోగించుకోండి



గ్రామ సచివాలయాల్లో అందుతున్న విద్యుత్ సేవలను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలి. గృహ, వ్యవసాయ విద్యుత్ మీటర్లు, విద్యుత్ బిల్లులు, ఇతర విద్యుత్ సమస్యలపై ఫిర్యాదు చేస్తే ఎనర్జీ అసిస్టెంట్లు త్వరితగతిన సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటారు.

– కృష్ణారెడ్డి, ఎస్ఈ ట్రాన్స్‌కో



వినియోగదారులతో మాట్లాడుతున్న జేఎల్ఎం

సేవల వివరాలివీ..

- గృహ, వాణిజ్య, వ్యవసాయ విద్యుత్ సర్వీసు కనెక్షన్ల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.
- విద్యుత్ సర్వీసుల్లో ఉన్న కేటగిరీల మార్పు చేసుకునే సౌకర్యం
- సర్వీసు పేరు మార్చుకునే సౌకర్యం
- అదనపు విద్యుత్ లోడ్ కోసం దరఖాస్తు చేసుకునే సౌకర్యం
- మీటర్ అధికంగా తిరుగుతుంటే టెస్టింగ్ చేసుకునే అవకాశం
- కాలిపోయిన విద్యుత్ మీటర్ స్థానంలో కొత్త మీటర్ ఏర్పాటుకు దరఖాస్తు చేసుకోవచ్చు
- విద్యుత్ బిల్లులో వచ్చిన సమస్యలపై ఫిర్యాదు చేసుకునే సౌకర్యం
- ట్రాన్స్‌ఫార్మర్లు, హై, లోటల్టేజీ సమస్యలపై ఫిర్యాదులు
- లైన్ల మార్చడం కోసం ఫిర్యాదు చేయవచ్చు
- శిథిలావస్థకు చేరుకున్న స్తంభాలను మార్చేందుకు ఫిర్యాదు ఇవ్వవచ్చు
- విద్యుత్ మీటర్ ఆగిపోవడం, నెమ్మదిగా తిరగడం వంటి సమస్యలను తెలుపవచ్చు
- గ్రామాల్లో విద్యుత్ బిల్లుల చెల్లింపుల సౌకర్యం

శ్రీవారికి రూ.3.34 కోట్ల ఆదాయం

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 5 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 63,928 మంది స్వామివారిని దర్శించుకోగా 22,358 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామి వారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.34 కోట్లు సమర్పించారు.

క్లుప్తంగా

పదో తరగతి మోడల్ పేపర్ల పుస్తకం ఆవిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డీఆర్వో రాజశేఖర్

చిత్తూరు కలెక్టరేట్ : యూటీఎఫ్ సంఘం ముద్రించిన పదో తరగతి మోడల్ పేపర్ల పుస్తకాన్ని డీఆర్వో రాజశేఖర్ ఆవిష్కరించారు. గురువారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మోడల్ పేపర్ల సంపుటి పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. పుస్తకాలను విరివిగా వాడుకలోకి తీసుకురావడానికి కృషి చేసిన యూటీఎఫ్ నాయకులను ప్రశంసించారు. అనంతరం డీఈఓ కార్యాలయంలో డీఈఓ విజయేంద్రరావు చేతుల మీదుగా పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి జీవీ రమణ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సోమశేఖర్‌నాయుడు, మణిగండన్, సభ్యులు దీనావతి, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


శ్రీనివాసులు మృతదేహం


సోమల: ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో గురువారం జరిగింది. స్థానికుల కథనం మేరకు..పెద్ద పంజాణి మండలం కొత్త కురవపల్లెకు చెందిన శ్రీనివాసులు(22) చౌడేపల్లె మండలం సింగిరిగుంటలో వివాహానికి ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. మండలంలోని చెన్నపట్నం చెరువు చెరువు మలుపు వద్ద అదుపుతప్పి పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

పొదుపు మంత్రం..కాంతివంతం

ఏ రంగంలోనైనా పొదుపు అవసరమే. ఇంధనం ఆదా చేయడమంటే సమర్థవంతంగా వినియోగించుకోవడమే. ఇది సుస్థిర అభివృద్ధికి ఆధారంగా మారుతుంది. ప్రస్తుత పరిస్థితుల్లో విద్యుత్ ఉత్పత్తి జెన్‌కోకు తలకు మించిన భారం అవుతోంది. ఈ పరిస్థితుల్లో పొదుపు చర్యలు అత్యావశ్యం. ఇంధనం పరిమితంగా వాడుకుంటేనే దేశం కాంతివంతం అవుతుంది.

- వృథాను అరికట్టాలి
- విద్యాసంస్థల్లో అవగాహన





చిత్తూరు కార్పొరేషన్: నిత్య జీవితం విద్యుత్ లేకుండ సాగదు. ఇల్లు, కార్యాలయాలు, వాణిజ్య దుకాణాలు, పరిశ్రమలు, ఇలా ఏవైనా విద్యుత్ లేకుండ పని జరగదు. దీంతో విద్యుత్ వినియోగం పెరుగుతోంది. ఫలితంగా బిల్లులు అధికంగా రావడమే కాక పర్యావరణంపై తీవ్ర ప్రభావం పడుతుంది. దీన్ని కట్టడి చేసేందుకు వృథాను అరికట్టి విద్యుత్‌ను పొదుపుగా వాడాల్సిన అవసరం ఉంది. ఈ మేరకు అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం ఇంధన పొదుపు వారోత్సవాలు నిర్వహిస్తోంది.

రూ.350 కోట్ల బిల్లులు

ఉమ్మడి జిల్లాలో 19.52 లక్షల విద్యుత్ సర్వీసులున్నాయి. వీటిలో గృహ వినియోగదారులు అత్యధికంగా 13.73 లక్షల సర్వీసులుండగా వాణిజ్య వ్యాపారస్తులు 1.61 లక్షల మంది ఉన్నారు. రోజు లక్షల యూనిట్లు వాడుతున్నారు. దీంతో లైన్ లాస్ అవుతుంది. నెలకు రూ.350 కోట్లు బిల్లుల కింద వస్తోంది.

వేసవిలో యూనిట్ రూ.18 కొనుగోలు

ప్రభుత్వం ఒక విద్యుత్ యూనిట్‌ను రూ.8.20 చొప్పున కొనుగోలు చేసి పేదలు, సామాన్యులకు రూ.2 నుంచి రూ.6 వరకు వివిధ కేటగిరిలకు స్లాబ్‌ల మేరకు సరఫరా చేస్తోంది. ఎండ కాలంలో రూ.18 వరకు కొని రాయితీపై సరఫరా చేస్తోంది. మిగిలిన భారంతోపాటు సబ్సిడీ, వ్యవసాయ ఉచిత విద్యుత్ ఖర్చు కూడా ప్రభుత్వమే భరిస్తోంది.

వారం పాటు కార్యక్రమాలు

జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు గురువారం నుంచి ఈ నెల 20వ వరకు వివిధ రూపాల్లో నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు. సబ్‌స్టేషన్లు, విద్యాసంస్థల్లో పలు కార్యక్రమాలు నిర్వహించి, వినియోగదారులకు విద్యుత్ వినియోగంపై అవగాహన కల్పించనున్నారు. విద్యుత్‌శాఖ ప్రవేశపెట్టిన ఎలక్ట్రానిక్స్ డిజిటల్ మీటర్లు అతి చిన్న ఎల్ఈడీ లైటును వినియోగించినా లెక్కిస్తాయి. గతంలో ఉన్న మెకానిక్ మీటర్లు తొలగించి, వాటిని ఏర్పాటు చేశారు. రిమోట్‌తో ఆఫ్ చేసినా టీవీ, చార్జర్లకు ఉన్న ఎల్ఈడీ లైట్ల విద్యుత్ వాడకాన్ని కూడా అవి పరిగణలోకి తీసుకుంటాయి.

పక్కాగా లెక్క

మూడు వాట్ల ఎల్ఈడీ బల్బు వెలుతురు 45 వాట్ల ఫిలమెంట్ బల్బుతో సమానం. ఇవి వాతవారణంలో కార్బన్‌ను విడుదల చేయవు. టీవీ చూశాక రిమోట్‌తో కాకుండా స్విచ్ ఆఫ్ చేయాలి. లేని పక్షంలో ఎల్ఈడీ లైట్లు ఆన్‌లోనే ఉన్న కారణంగా డిజిటల్ మీటర్ యూనిట్లు కౌంట్ చేస్తూనే ఉంటుంది.

ఇలా చేస్తే ఆదా..

- ఇళ్లలో సాధారణంగా గుండ్రని ఎర్ర బల్బు వాడరాదు. సీఎల్ఎఫ్, ఎల్ఈడీ బల్బులు వాడాలి. సీఎల్ఎఫ్, ఎల్ఈడీ బల్బుల వాడకంతో విద్యుత్ ఆదా, ఎక్కువ వెలుతురు, ఎక్కువ కాలం మన్నిక వస్తాయి.
- ఐఎస్ఐ మార్కు ఉన్న గృహోపకరణాలు వాడాలి. కరెంటు స్టవ్, వాటర్ గ్రీజర్లకు బదులు గ్యాస్ హీటర్స్, కుక్కర్లు గ్యాస్ వినియోగించాలి. కంప్యూటర్లకు ఆర్తింగ్ ఏర్పాటు చేసుకోవాలి. షట్‌డౌన్ చేశాక స్విచ్‌లు ఆఫ్ చేయాలి.
- సహజంగా వచ్చే గాలి, వెలుతురును వినియోగించాలి.
- సెల్‌ఫోన్ చార్జింగ్ అయ్యాక స్విచ్ ఆఫ్ చేయకపోతే చార్జర్‌లో ఉన్న ఎల్ఈడీ లైటుకూ విద్యుత్ కాలుతుంది.
- మిక్సీ, కూలర్, వాషింగ్‌మిషన్ ఏసీ, ఇస్త్రీ పెట్టె, హోం థియేటర్, టీవీ, సౌండ్ సిస్టమ్స్, దోమల మిషన్లు అవసరం లేకపోతే స్విచ్ ఆఫ్ చేయాలి.

ఉమ్మడి జిల్లాలో విద్యుత్ సర్వీసులు

గృహ సర్వీసులు	13,73,346
వాణిజ్యం	1,61,215
పరిశ్రమలు	21,175
ప్రభుత్వ సర్వీసులు	46,690
వ్యవసాయం	3,17,709
వీధిదీపాలు	17,000
ఆర్‌డబ్ల్యూఎస్	13,924
హెచ్‌టీ	1,906
మొత్తం	19,52,790

పొదుపు పాటించాలి



విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలి. ఇళ్లలో సీఎల్ఎఫ్, ఎల్ఈడీ బల్బులు వాడితే 40 శాతం విద్యుత్ ఆదా అవుతుంది. అవసరం లేకుంటే స్విచ్ ఆఫ్ చేయాలి. గ్రామీణ ప్రాంతాలకు నిరంతరం విద్యుత్ సరఫరా ఇస్తున్నాం. అనవసరంగా వినియోగిస్తే బిల్లులు రెట్టింపు వస్తాయి. అలాగే రైతులు ఉచిత విద్యుత్‌ను ఇతర అవసరాలను వినియోగించరాదు.

- కృష్ణారెడ్డి, ఎస్ఈ ట్రాన్స్‌కో

ఊపిరితిత్తుల మార్పిడికి ఆర్థిక సహాయం

- సీఎం ఆదేశాల మేరకు మునెమ్మకు ప్రత్యేక చికిత్స
- ఇచ్చిన మాట ప్రకారం బాధితురాలికి సీఎంఆర్ఎఫ్ నిధులు మంజూరు
- రూ.20 లక్షల చెక్కు అందజేసిన కలెక్టర్ షణ్మోహన్


మునెమ్మ భర్త సుబ్రహ్మణ్యంకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : శ్వాసకోస సమస్యతో బాధపడుతున్న మునెమ్మకు ఊపిరితిత్తుల మార్పిడి చికిత్స కోసం సీఎంఆర్ఎఫ్ నుంచి ఆర్థిక సాయం అందజేసినట్లు కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. గురువారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో బాధిత మహిళ మునెమ్మ భర్త సుబ్రహ్మణ్యంకు సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని బంగారుపాళెం మండలం తగ్గువారిపల్లె గ్రామానికి చెందిన మునెమ్మ ఊపిరితిత్తుల మార్పిడికి రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం చేసిందన్నారు. ఈ ఏడాది జూలై 4వ తేదీన చిత్తూరు జిల్లా కేంద్రానికి సీఎం విచ్చేసిన సమయంలో తన ఊపిరితిత్తుల వ్యాధి చికిత్సకు సహాయం చేయాలని మునెమ్మ వినతిపత్రం అందజేసిందన్నారు. ఆమె వినతిని స్వీకరించిన సీఎం వెంటనే బాధిత మహిళకు మెరుగైన చికిత్స చేయించాలని ఆదేశించారని చెప్పారు. అనంతరం ఆమెకు చెన్నైలోని మహాత్మాగాంధీ మెమోరియల్ ఆస్పత్రిలో డాక్టర్ బాలకృష్ణ నేతృత్వంలో ఆగస్టు 27వ తేదీన ఊపిరితిత్తుల మార్పిడి సర్జరీ నిర్వహించినట్లు తెలిపారు. ఆ సర్జరీ అనంతరం మునెమ్మ పూర్తిగా కోలుకున్నారన్నారు. చెక్కును అందుకున్న సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పేద కుటుంబానికి చెందిన తమకు పెద్ద ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకునే స్తోమత లేదన్నారు. తన భార్య మునెమ్మ ఏడాదిగా ఊపిరితిత్తుల సమస్యతో ఇబ్బందులు పడుతోందని చెప్పారు. డాక్టర్లకు చూపించగా ఊపిరితిత్తులు మార్చాలని చెప్పారని తెలిపారు. ఊపిరితిత్తుల మార్పిడికి అయ్యే ఖర్చు తమ వద్ద లేకపోవడంతో జిల్లాకు సీఎం వచ్చినప్పుడు వినతిపత్రం ఇచ్చామన్నారు. మా వినతిని స్వీకరించిన సీఎం వైద్యచికిత్సలకు అయ్యే ఖర్చు భరిస్తామని వెంటనే మెరుగైన చికిత్స చేయించాలని అధికారులను ఆదేశించారని తెలిపారు. డోనర్ దొరకగానే మునెమ్మకు ఊపిరితిత్తుల మార్పిడి చికిత్స చేశారని, చికిత్సకు అయిన ఖర్చు రూ.20 లక్షలను ప్రభుత్వం అందజేసిందన్నారు. మునెమ్మకు ప్రాణాలు పోసిన సీఎం జగనన్నను జీవితాంతం గుర్తు పెట్టుకుంటామని సుబ్రహ్మణ్యం ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల నిర్వహణకు చర్యలు

- ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశాం
- నేటి నుంచి యథావిధిగా కేంద్రాలు
- సమ్మెను వీడి విధులకు రావాలి
- జెడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి


మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి

చౌడేపల్లె: సమ్మె కారణంగా మూడు రోజులుగా మూతపడిన అంగన్‌వాడీ కేంద్రాలను యథావిధిగా నడపడానికి చర్యలు తీసుకున్నామని, పిల్లలు, బాలింతలు, గర్భిణులకు ప్రభుత్వ సేవలందించేలా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామని జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ సుధాకర్, ఐసీడీఎస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 2,420 అంగన్‌వాడీ కేంద్రాలుండగా పులిచెర్ల, రొంపిచెర్ల, సదుం, కార్వేటినగరం, గుడిపాల మండలాల్లోని 809 కేంద్రాల సిబ్బంది సమ్మెలోకి వెళ్లకుండా అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. మిగిలిన కేంద్రాల సిబ్బంది సమ్మెలో ఉన్నారన్నారు. వీరంతా సమ్మెను వీడి వెంటనే విధుల్లోకి రావాలని, ఉన్నతాధికారుల ఆదేశాలను పాటించాలన్నారు. రెండు రోజులుగా 209 మంది సమ్మెను వీడి విధులకు హాజరయ్యారన్నారు. చౌడేపల్లె మండలంలో చౌడేపల్లె -1 కేంద్రం మినహా మిగిలిన ప్రాంతాల్లో ఆయా సచివాలయాల ఎంఎస్‌కే, వీఓఏ, స్వయం సహాయక సంఘాల మహిళతోపాటు అవసరమైన ప్రాంతాల్లో విద్యాశాఖ సహాయంతో శుక్రవారం నుంచి కేంద్రాలను నిర్వహించేలా ఆదేశాలు జారీ చేశామన్నారు. కేంద్రాలకు వెళ్లి ఆయా వీఆర్వోల సమక్షంలో కేంద్రాల్లో ఉన్నస్టాకు వివరాలను పంచనామా నిర్వహించి, స్వాధీనం చేసుకోవాలని ఆదేశించామని చెప్పారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, సహకారంతో కేంద్రాలు యథావిధిగా పనిచేసేలా చూడాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వహించాలని, పాఠశాలలో అనుసంధానంగా ఉన్న ప్రాంతాల్లో విద్యాశాఖ సహాయంతో వంట చేసి పిల్లలకు మెనూ మేరకు అందించాలని సూచించారు. విధుల కేటాయించిన అధికారుల ఉత్వర్వులను జారీ చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాలను పాటించి సమ్మె విరమించి, విధులకు హాజరయ్యేవారికి సహకరిస్తామన్నారు. ఈ సమావేశంలో ఏసీడీపీ అమరజ్యోతి, సూపర్‌వైజర్ రమాదేవి పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమికి విముక్తి

- హైకోర్టు ఆదేశాలతో రంగంలోకి దిగిన అధికారులు
- పీఆర్‌డీఆర్ తారు ప్లాంట్ స్వాధీనం చేసుకున్న రెవెన్యూ అధికారులు


తారు యంత్రాలను తొలగిస్తున్న ప్రభుత్వ సిబ్బంది

పుత్తూరు: పరాధీనంలో ఉన్న రూ.కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూమికి విముక్తి లభించింది. లీజు పేరిట ఏళ్ల తరబడి కోర్టులో నడిచిన కేసు వివాదంపై ఈ నెల 12వ తేదీన హైకోర్టు ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు వెలువరించింది. దీంతో గురువారం స్థానిక తహసీల్దార్ పరమేశ్వరస్వామి, మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎన్‌రెడ్డి తదితర అధికారుల బృందం సదరు స్థలాన్ని తమ స్వాధీనంలోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే...పుత్తూరు పట్టణంలోని మరాఠిగేటు వద్ద నందిమంగళం రెవెన్యూ లెక్క దాఖలాలోని సర్వే నంబర్ 603, 4, 5, 6 లోని 3 ఎకరాల భూమిని పీఆర్‌డీఆర్ అనే సంస్థకు తారు తయారీ కేంద్రం నిర్వహించేందుకు ప్రభుత్వం లీజుకు ఇచ్చింది. జిల్లాలోని ఆర్అండ్‌బీ రోడ్ల పనులకు ఇక్కడి నుంచే తారును సరఫరా చేసేవారు. పీఆర్‌డీఆర్ సంస్థ యజమాని మహదేవరెడ్డి లీజు అగ్రిమెంటును పొడిగించాలంటూ కోర్టును ఆశ్రయించారు. దీనిపై కొన్నేళ్లుగా కోర్టులో కేసు నడుస్తూ వచ్చింది. ఇటీవల మహదేవరెడ్డి మృతి చెందాడు. ఈ నేపథ్యంలో గత మంగళవారం కోర్టు తీర్పు స్థానిక రెవెన్యూ శాఖకు అనుకూలంగా వచ్చింది. దీంతో అధికారులు తారు ప్లాంటుకు సంబంధించిన యంత్రాలను తొలగించి, భూమిని చదును చేసి తమ ఆధీనంలోకి తీసుకొన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం


చికిత్స పొందుతున్న పవన్

చౌడేపల్లె: శరీరంపై పెట్రోల్ పోసుకుని ఓ యువకుడు నిప్పంటించుకున్న సంఘటన గురువారం సాయంత్రం చౌడేపల్లె మండలం కాగతి గ్రామంలో చోటుచేసుకొంది. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన వెంకటరమణ కుమారుడు పవన్(22) మేస్త్రీగా కూలీ పనులకు వెళ్లేవాడు. ఈ క్రమంలో గురువారం కాగతిలోనే కూలీ పనికి వెళ్లి ఇంటికి వెళ్లాడు. కుటుంబ కలహాల కారణంగా తల్లిదండ్రులతో గొడవపడి ఇంటి ముందే పెట్రోల్ పోసుకుని నిప్పటించుకుని ఇంటి లోపలికి వెళ్లి గడియ పెట్టుకొన్నాడు. కేకలు గమనించిన స్థానికులు, కుటుంబ సభ్యులు తలుపు తొలగించిలోనికి వెళ్లి మంటలను ఆర్పారు. తీవ్రంగా గాయపడిన యువకుడికి అక్కడే ఉన్న సచివాలయ వైద్య సిబ్బంది ప్రథమచికిత్స చేసి, 108లో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో వైద్యులు తిరుపతికి సిఫార్సు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సౌకర్య శోభితం

ప్రభుత్వ పాఠశాలలు 'సౌకర్య' శోభితంగా మారుతున్నాయి. ప్రైవేటు, కార్పొరేట్‌లో రూ.లక్షలకు లక్షలు పోసి చదువుకొనలేని' పేద విద్యార్థులు విద్యాభ్యాసానికి చదువులమ్మ చెట్టు నీడగా సర్కారు స్కూళ్లు మారుతున్నాయి. ఆర్థిక స్తోమతలేని తల్లిదండ్రులకు ఖర్చులేని కల్పవృక్షాలుగా ప్రభుత్వ పాఠశాలలు మారాయి. ఉత్తమ బోధన, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్, పోషక విలువలు కలిగిన మధ్యాహ్న భోజనం, అమ్మఒడి, విద్యా దీవెన, వసతి దీవెన తదితర వసతులు విద్యార్థులకు వరాలుగా మారాయి. దీనిపై విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వారి మాటల్లోనే..

–చిత్తూరు కలెక్టరేట్



నాడు–నేడు పథకంతో అభివృద్ధి చెందిన సర్కారు బడి

అందాల మనబడి



నేను ఉపాధ్యాయునిగా విధుల్లో చేరినప్పుడు బడుల్లో వసతులు ఏ మాత్రం ఉండేవి కావు. తరగతి గదిలోని పైకప్పు దుస్థితికి చేరుకుని పెచ్చులూడి పడే పరిస్థితులుండేవి. ఎప్పుడు ఏమవుతుందోనని పాఠాలు సరిగ్గా చెప్పలేని స్థితి ఉండేది. ప్రస్తుతం అలాంటి సమస్యలేమి లేవు. రాష్ట్ర ప్రభుత్వం స్కూళ్ల బలోపేతానికి నాడు–నేడు పథకాన్ని ప్రవేశపెట్టి ప్రైవేటుకు దీటుగా అన్ని సౌకర్యాలతో నిర్మించడం గొప్ప విషయం. మా బడి అందాల గుడి అన్నట్లుగా పునర్జీవం పోశారు. వసతులు మెరుగుపడడంతో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది.

- పి. సునీత, ఎస్ఆర్ కండ్రిగ ప్రాథమికోన్నత పాఠశాల, కార్వేటినగరం మండలం

నా బిడ్డ బాగా చదువుకుంటున్నాడు



మేమెలాగో చదువుకోలేదు. సీఎం జగన్ పుణ్యమాని నా బిడ్డ బాగా చదువుకుంటున్నాడు. ప్రైవేట్ బడికి పంపించే స్తోమత మాది కాదు. గతంలో ఏ పాలకులు ప్రభుత్వ బడి గురించి పట్టించుకోలేదు. గతంలో కింద కూర్చుని చదుకోవాల్సిన పరిస్థితి ఉండేది. ఇప్పుడు ప్రైవేట్ స్కూళ్లలో కూడా లేని విధంగా మంచి డెస్కులు ఏర్పాటు చేశారు. స్మార్ట్‌టీవీల ద్వారా పాఠాలు బోధిస్తున్నారు. బడి తెరిచిన రోజే పుస్తకాలు, యూనిఫామ్, ఇతర వస్తువుల కిట్ ఇచ్చారు. నా బిడ్డ చదువుకునేందుకు ఇంతగా కృషి చేస్తున్న సీఎం సారుకు రుణపడి ఉంటాం.

- కవిత, విద్యార్థి తల్లి, ఎస్ఆర్ కండ్రిగ, కార్వేటినగరం మండలం

విద్యార్థుల సంఖ్య పెరిగింది



ప్రభుత్వం చేపట్టిన నాడు–నేడు పథకంతో మా బడి రూపురేఖలు పూర్తిగా మారాయి. అన్ని వసతులు ఏర్పడ్డాయి. సర్కారు బడుల బలోపేతానికి రూ.వేల కోట్లు ఖర్చు చేయడం నా సర్వీసులో మొదటి సారి చూస్తున్నాను. నాడు–నేడు పథకంతో పాఠశాలల్లో అన్ని వసతులు సమకూరడంతో అడ్మిషన్లు బాగా వృద్ధి చెందాయి. ప్రైవేట్ బడులకు వెళ్లే పిల్లలు బడిలో చేరారు. విద్యార్థుల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషి అభినందనీయం.

- ఎల్లయ్య, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం, సోమల మండలం

సత్ఫలితాలు



నాడు–నేడు పథకంతో సత్ఫలితాలు వస్తున్నాయి. విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు ప్రభుత్వం అమలు చేసిన నాడు–నేడు పథకంలో మా బడి అధునాతనంగా తయారైంది. నేను ఈ పాఠశాలలో చేరినప్పుడు ఎలాంటి సౌకర్యాలు ఉండేవి కావు. ఇప్పుడు అన్ని సౌకర్యాలున్నాయి. గతంలో సౌకర్యాలు అంతంత మాత్రంగానే ఉండడంతో విద్యార్థులు ప్రైవేట్ బాట పట్టేవారు. గత నాలుగేళ్లలో చాలా మార్పు వచ్చింది. తల్లిదండ్రులు తమ పిల్లలను సర్కారు బడుల్లో చేర్పిస్తున్నారు.

- చెంచులయ్య, ఎస్జీటీ, తమ్మినాయనిపల్లె సోమల మండలం

రేపు తిరుప్పావై ప్రవచనాల ప్రారంభ సమావేశం

తిరుపతి కల్చరల్: పవిత్రమైన ధనుర్మాసాన్ని పురస్కరించుకొని టీటీడీ ఆళ్వార దివ్యప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఈనెల 17 నుంచి జనవరి 14వ తేదీ వరకు తిరుపతితో పాటు దేశవ్యాప్తంగా 216 కేంద్రాల్లో ప్రముఖ పండితులు తిరుప్పావై ప్రవచనాలు చేయనున్నారు. ఈమేరకు 16వ తేదీ శనివారం సాయంత్రం 5.30 గంటలకు అన్నమాచార్య కళామందిరంలో తిరుప్పావై ప్రవచనాల ప్రారంభ సమావేశం జరగనుంది. టీటీడీ ఆళ్వార దివ్యప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఇందు కోసం ఏర్పాట్లు జరుగుతున్నాయి. తిరుపతి పెద్దిజీయర్‌స్వామి, చిన్నజీయర్ స్వామి ఇతర అధికారులు ఈ కార్యజక్రమంలో పాల్గొంటారు.

హత్య కేసులో ఏడుగురికి రిమాండ్

తిరుపతి లీగల్: హత్య కేసులో ఏడుగురికి 14 రోజులు రిమాండ్ విధిస్తూ తిరుపతి రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి పల్లపోలు కోటేశ్వరరావు గురువారం ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 10వ తేదీన తిరుపతి కొత్తపల్లి, చిరంజీవి రోడ్డు సమీపంలో ఒకరు హత్యకు గురయ్యారు. మృతుడి బంధువు ఫిర్యాదు మేరకు ఈస్ట్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టి తిరుపతి కొర్లగుంట మారుతీనగర్‌కు చెందిన బీటెక్ విద్యార్థి షేక్ అఫ్రోజు, ఎం.లోకేష్, ఎస్.బలరాం, తిరుపతి ఎరుకల కాలనీకి చెందిన పి.దేవేంద్ర, తిరుపతి చంద్రశేఖర్‌రెడ్డి కాలనీకి చెందిన ఎం.జనార్ధన్, తిరుచానూరుకు చెందిన వి.వెంకట శివకుమార్ అలియాస్ శివ, తిరుపతి పీకే లేఅవుట్‌కు చెందిన పి.హరికేశవ అలియాస్ కేశవను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు.

జాతీయ త్రోబాల్ పోటీలకు సోమల విద్యార్థిని


హేమనిధిని అభినందిస్తున్న హెచ్ఎం నాగరాజ, పీడీ కరుణానిధి

సోమల: జాతీయ స్థాయి త్రోబాల్ పోటీలకు సోమల ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థిని హేమనిధి ఎంపికైనట్లు ఆ స్కూలు హెచ్ఎం నాగరాజ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు ఉమ్మడి కర్నూలు జిల్లా నంద్యాలలో జిల్లా స్కూల్ గేమ్స్ అండర్ 14 విభాగంలో త్రోబాల్ పోటీలు జరిగాయని పేర్కొన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచి చిత్తూరు జిల్లా జట్టు బాలికల విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచిందన్నారు. సోమల విద్యార్థిని హేమనిధి ప్రధాన భూమిక పోషించడాన్ని గుర్తించిన రాష్ట్రస్థాయి సెలక్షన్ కమిటీ సభ్యుడు వంశీకృష్ణ బాలికను రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపిక చేశారన్నారు. ఎంపికైన విద్యార్థిని త్వరలో ఢిల్లీలో జరగబోయే జాతీయ స్థాయి త్రోబాల్ పోటీలలో రాష్ట్రం తరుపున పాల్గొంటుందని ఫిజికల్ డైరెక్టర్ కరుణానిధి తెలిపారు.